# సత్యవాక్కు

# The Word of Truth

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్య వాణి' యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలుపొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA–533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవుసరం !!

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్ట్ బాక్స్ - **80,** కాకినాడ - **533 001**

ఎడిటర్ : జె. సి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ : జాషువా గూటం

సంచిక **7** ఫిబ్రవరి **1984** సంపుటి **4**


# సంపాదకీయము

## స్థానిక సంఘం యెడల మన బాధ్యతలు

## (*Our duties to the Local Church*)

మన ప్రభువు యొక్క సంఘం ప్రపంచ వ్యాప్తముగా ఉన్నది. ఆ సంఘము (**Church**) స్థానికముగా సమాజము (**Congregation**) రూపమున యున్నది. ఒక నగరములో లేక ఒక ప్రాంతములో అలాంటి స్థానిక సంఘాలు ఎన్నైనా ఉండవచ్చు. క్రొత్త నిబంధన కాలములో ఇలాంటి సంఘముల సముదాయమును గూర్చి మాట్లాడుచు, వాటిని క్రీస్తు సంఘములు అని పౌలు అన్నాడు (రోమా 16:16). ప్రతి క్రీస్తు సంఘము స్వతంత్ర ప్రతిపత్తి గలది, దాని యొక్క శిరస్సు క్రీస్తు, అది తన స్వంత నాయకత్వము కల్గి యున్నది, ఆరాధనను నిర్వహిస్తాది, తన స్వసేవకు పూనుకొంటాది.

అలాంటి స్థానిక సంఘమందు, క్రైస్తవులైన మనం సభ్యులుగా యున్నాం. ఆ సంఘములో మనం ఒక భాగమైయున్నందున, దాని యెడల మనకు కొన్ని విధులు, బాధ్యతలు ఉన్నాయి. ఆ విధులు

బాధ్యతలు నెరవేర్చుటలో మనం నమ్మకంగా ఉండాలి. మనం ఆ విధముగా చేసినట్లయితే, ప్రభువు యొక్క పరిచర్యకే దీవెనగా నుండగలం. దాని అభివృద్ధికి, వ్యాప్తికి కృషి సల్పినట్లయితే, తగిన సమయమందు ప్రభువు మనలను దీవించి, మన ప్రయాసలకు బహుమానము నిస్తాడు.

కొందరు ఏదో ఒక క్లబ్బులో సభ్యత్వం పొందురీతిగా సంఘములో సభ్యులైన వారున్నారని చెప్పటానికి విచారిస్తున్నాను. సభ్యులలో కొందరు ఆరాధనయందు కేవలం ఉల్లాసం కల్గించే కార్యక్రమం తిలకిస్తున్నవారులా ఉంటారు. సంఘ సభ్యులుగా యుండుట వలన లభించే మేలులను పొందగోర్తారు గాని వారి సమయాన్ని, ధనమును ఇవ్వరు, పాటుపడరు. అంటే, ఏదేని వ్యాపారములో భాగస్తునిగా ఉండగోరుచు, దానికి పెట్టుబడి ఏమియు పెట్టకుండా, లాభం ఆశించడములా ఉంటాది. అటువంటి సభ్యులు బలహీనులు గనుక సంఘం అంటే ఏమిటో సభ్యునిగానుండుట అంటే ఏమిటో అవగాహన చేసికొనగల్గునట్లు వారికి మరి యెక్కువగా బోధించవలెను.

ఇప్పుడు స్థానిక సంఘం యెడల మనకున్న విధులు, బాధ్యతలు యిస్తున్నాం. ఈ దిగువ నీయబడిన వాటితో నీ స్వపరిస్థితిని బేరీజు వేసుకొని నిజాయితీగా పరీక్షించుకో :

1. ఆరాధనకు నమ్మకముగా హాజరగుటలో మనము స్థానిక సంఘమునకు బాధ్యులం. అంటే ప్రతీ ప్రభువుదినమున హాజరు కావలెను. మనతో బాటు యితరులను తోడ్కొని వెళ్లుటకు సాధ్యమైనంతమట్టుకు ప్రయత్నించవలెను. హెబ్రీ లేఖకుడు యిల్లు చెప్పాడు: "కొందరు మానుకొనుచున్నట్టుగా, సమాజముగా కూడుట మానక, ఒకని నొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి ఎక్కువగా ఆలాగు చేయండి" (హెబ్రీ 10:25).

సంఘం మనమీద ఆధారపడేవారిలాగ మనముండాలి. మనము హాజరులో నమ్మకముగా లేకపోతే మనము మంచి మాదిరిగా ఎట్లుండగలము? కార్యక్రమములలో ఎట్లు పాల్గొందగలం? సంఘము అభివృద్ధినొంది వ్యాప్తిజెందునట్లు చేయుటకు పనిని నిర్ణయించుటలో ఎట్లు సహాయపడగలం? ఆదివార ఉదయారాధనకు హాజరగుటకు శాయశక్తులా ప్రయత్నించడమే కాదుగాని ప్రతీ కార్యక్రమమునకు హాజరగుటకు ప్రయత్నము చేయవలెను. ప్రత్యేక కూటములకు కూడ హాజరు కావలెను.

2. మన పూర్తి మద్దతును వారపు చందాలు యిచ్చుటలో స్థానిక సంఘమునకు బాధ్యులమై యున్నాం. కొరింధులో నున్న క్రైస్తవులను పౌలు ఇట్లు హెచ్చరించాడు: పరిశుద్ధుల కొరకైన చందా విషయమైతే నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినపుడు చందా పోగుచేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లినకొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" (1 కొరింథీ 16:1, 2). అతడు మరల ఇట్లన్నాడు: "కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంటకోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంట కోయును అని ఈవిషయమై చెప్పవచ్చును. సణుగుకొనకయు బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను. దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును" (2 కొరింథీ 9 : 6, 7). దీని భావమేమిటంటే, కొరింధులో నున్న క్రైస్తవులవలె మనమును ఇయ్యవలెను. సంఘము చేయవలసిన సేవ యున్నదని, అది దానిని చేయగల్గుటకు సరిపడునంత సొమ్ము సమకూర్చటానికి ఇదొక్కటే మార్గమని మనము గుర్తించాలి. దానికి డబ్బు ఎక్కడ నుండి వస్తాది? స్థానిక సంఘము తన పనిని చేయుటకు, తన్నుతాను పోషించగల్గేవరకు కొన్నిసార్లు యితర స్థలాల్లో నివసిస్తున్న

సోదరులు ఆరంభములో ధనమును పంపవచ్చును. కాని అటువంటప్పుడు, స్థానిక సోదరులు ఇచ్చుట మానివేయ వలదు, ఎవరో ఒకరు అంతా ఇచ్చునట్లు చేయకూడదు. స్థానిక సంఘముయొక్క అక్కరలు తీర్చుటకు—అద్దె చెల్లించుటకు, విద్యుత్తు, నీటి ఖర్చులు చెల్లించుటకు, కూటముల వివరాలను ప్రకటన చేయుటకు, బైబిలు సాహిత్యాన్ని పంపుటకు అగు తపాలాఖర్చులు, స్థానిక బోధకునికి సహాయమిచ్చుటకు మున్నగునవి భరించుటకు సభ్యులమైన మనము ప్రతి ఆదివారమున చందా నియ్యవలెను. అవుసరములలో నున్నవారికి సహాయము చేయుటకు ఇయ్యవలసిన ఆవశ్యకత ఉన్నది. మందులు కొనుక్కోలేని స్థితిలో నున్నవారికి, క్షామము, వరదలు లేక తుఫాను సంభవించిన ప్రాంతములో నున్న సోదరులకు ధనము పంపించుటకు సహాయము చేయాల్సిన అవుసరము కలుగవచ్చును. ఇలాంటి అవుసరములే అనేకము రావచ్చును. చివరిగా, ఇతర ప్రాంతములలో సువార్త ప్రకటించుటకు మనము ధనమును సమకూర్చవలెను. అందువలన, మనము ఇవ్వనట్లయితే, లేక ఇవ్వవలసిన విధముగా ఇయ్యనట్లయితే సంఘము చేయగల్గినది సంకుచితమైపోతాది. సహజముగా, మన మెంత ఎక్కువ ఇయ్యగల్గితే స్థానిక సంఘము అంత అధికముగా చేయగలదు. ఇచ్చుటను గూర్చి బైబిలు బోధించు రీతిగా మనము నేర్చుకొనుట అత్యవుసరం. అప్పుడు మనము స్వయముగా ఇచ్చు అభ్యాసమునకు అన్వయించు కొందుము. మనమీ పాఠములను నేర్చుకొని, వాటిని అభ్యసించినట్లయితే సంఘానికి ప్రయోజనకరముగా ఉంటాది. ఇతరులకు ఎక్కువ సహాయము చేయటానికి, సువార్తను వ్యాప్తి జేయుటకు మనలను సమర్థవంతులుగా చేయుటవలన ఇతరులును మేలు పొందుతారు.

౩. పరిచర్యయందు పాల్గొందుటలో మనము స్థానిక సంఘానికి బాధ్యులం. ఆరాధనలకు హాజరై చందాలు ఇచ్చుట మాత్రమే గాక

సంఘములో యున్న పురుషులమైన మనము ఆయా కూటములందు పాల్గొనుటకు అందుబాటులో ఉండాలి. మనము ప్రార్థన, ప్రభువు బల్లను నిర్వహించుట, పాటలు పాడించుట, తరగతిలో బోధించుట, సువార్త చేయుట మున్నగునవి చేయవచ్చును. క్రైస్తవులైన వెంటనే యివన్నియు చేయలేరుగాని కాలక్రమేణా, ఆయా కార్యములు చూచుటవలనను, దేవుని వాక్యమును గూర్చిన జ్ఞానములో ఎదుగుటవలనను, ఇతరులు మనకిచ్చు ప్రోత్సాహమును బట్టి అనేక విధములుగా తోడ్పడగలం. ఆరంభములో ఉత్తమముగా నిర్వహించలేక పోవచ్చును గాని రానురాను అనుభవము గడించుకొలది, అభివృద్ధి పొంది లెస్సగా జరిగింపవచ్చును. వ్యక్తిగత సేవలోను, బయటకు వెళ్ళి కూటములు నిర్వహించుటలోను, లేక వేరే చోటకు వెళ్ళి కూటములు జరిపించు వారితో వెళ్ళుటలోను మనము సహకరించవచ్చును. మనము రోగులను, బలహీనులుగా నున్న సభ్యులను దర్శింపవచ్చును. పరిచర్య కొరకు ప్రార్థింపవచ్చును. వృద్ధ స్త్రీలు—ప్రభురాత్రి భోజనమును సిద్ధము చేయవచ్చును; యౌవన స్త్రీలకు పిల్లలకు ఉపదేశింప వచ్చును; రోగులను దర్శింప వచ్చును. అవసరములలో నున్నవారిని ఆదుకోవచ్చును; అతిథి సత్కార్యమును విస్తృతము చేయవచ్చును, అలాగే ఇంకా ఎన్నో యవ్వనస్థులు సహితము వాక్యపఠనములోను, తరగతులకు హాజరగుటలోను, వారి యొక్క మిత్రులను కూటములకు ఆహ్వానించుటలోను యింకా పలు రీతులుగా సహకరింప వచ్చును. ఏ పురుషుడైనా స్త్రీయైనా చేయగల్గితే విస్తారమైన పని యున్నది. దయచేసి, ప్రతీదీ ఏ కొద్దిమందికో వదలివేయక యుందము. మనము చేయగల్గిన పని వేరొకరికి వదలిపెట్టకుందము. మనమందరం యిమిడి యున్నప్పుడు, మనము ఆధ్యాత్మికముగా ఎదిగి, శ్రేష్టుల మౌతాం. సంఘము ఆధ్యాత్మికతలోను సంఖ్య

లోను పెరుగుటలో యిది తోడ్పడుట ఖాయం. క్రొత్త నిబంధన కాలములో శిష్యులకు హింసకల్గినను వారు ఆయా దేశములలో చెదరి పోయి, వారు వెళ్లిన ప్రతిచోట వాక్యమును ప్రకటించారు (అపొ.కా. 8:4). మనము యిక్కడ గమనించాల్సిన వాస్తవ మేమంటే, వారం దరు ప్రేమేయము కల్గి యుండిరి. మరల, ఆదిమ క్రైస్తవులను గూర్చి మనము ఇలా చదువగలం: "వారు అపొస్తలుల బోధయందును, సహ వాసమందును, రొట్టె విరుచుటయందును, ప్రార్థనలయందును ఎడ తెగక యుండిరి" (అపొ. కా. 2:42).

4. సంఘమందున్న భక్తి హీనులతోను, అవిశ్వాసులతోను వ్యవహరించుటలో మనము స్థానిక సంఘానికి సహాయం చేయవలెను. ప్రభువుయొక్క స్వంత అపొస్తలులలోనే ఒకడు దుష్టు డయ్యాడు. వాడు యూదా అని మన మెరుగుదుము. అననీయ, సప్పీర, తదితరులు సంఘసభ్యులలో అవిశ్వాసులని లేఖనములు చెబుతున్నాయి. అవి శ్వాసులకును, తొట్రిల్లిన వారికినికూడ బోధించాలని మనకు దేవుని వాక్యము చెబుతున్నది. మొదటిగా వారి యొద్దకువెళ్ళి వారి పరిస్థితిని గూర్చి వారితో మాట్లాడవలెనని ప్రభువు చెబుతున్నాడు. వారు విననట్లయితే, మనతో ఒకరిద్దరిని తీసుకొని వెళ్ళవలెను. వారు ఖాతరు చేయనట్లయితే ఆ సంగతిని సంఘము ఎదుట పెట్టాలి. అప్పుడుకూడ తమ పాపాల విషయము మారుమనస్సు నొందక, సంఘము నొద్దకు తిరిగి రానట్లయితే, వారినుండి సభ్యులు తొలగిపోవలెను (మత్తయి 18:15-18). ఫలింపని ప్రతి తీగ నరికివేయబడునని క్రీస్తు బోధించాడు (యోహాను 15:1-8). జారులు, లోభులు, విగ్రహారాధికులు, దూష కులు, త్రాగుబోతులు, దోచుకొనువారు, యిటువంటివారితో సాంగ త్యము చేయకూడదని పౌలు చెప్పాడు. అట్టివారితో, సామాజిక సంబంధము పెట్టుకోకూడదు, భోజనమే చేయరాదు (1 కొరింథీ 5). మనలో భేదములను కలుగజేయువారిని కనిపెట్టి యుండాలని అతడు

మరలా చెప్పాడు (రోమా 16:17, 18). మీలో అక్రమముగా నడచు ప్రతి సోదరుని యొద్ద నుండి తొలగిపోవలెను (2 థెస్స 3:6). మతభేదములు కల్గించువానిని విసర్జించాలి (తీతు 3 : 10). అబద్ధ బోధకుల విషయములో దేవుని ఆజ్ఞను పాటించాలి (2 యోహాను : 9-11). సంఘము సాధ్యమైనంత స్వచ్ఛముగా ఉండాలి (ఎఫెసీ 5:27; 2 కొరింథీ 11:2), క్రీస్తు తన రాకడ దినమందు రాజ్యములోని లేక సంఘములోని దుష్టుల నందరిని సమకూర్చి, వారిని నరకములో పడ వేస్తారు (మత్తయి 13 : 41, 42). ప్రభువు తాను ప్రేమించువారిని పవిత్రులనుగా చేస్తాడు అని హెబ్రీ లేఖకుడు చెబుతున్నాడు (హెబ్రీ 12 : 1-11). మనము భక్తిహీనులను, అవిశ్వాసులను తమ పాపాల విషయము మారుమనస్సు నొందని వారిని హెచ్చరించనట్లయితే మనము దేవునికి లోబడనట్లే తద్వారా సంఘం బలహీనమైనదగును. దీన్నిబట్టి సంఘం పవిత్రమైంది కాదని అవిశ్వాసులుగా యుండటానికి ప్రోత్సహిస్తున్నామని భావము కాదు. పైగా, సంఘ సభ్యులలో కొందరు అలాటి భక్తిహీనతను అభ్యసిస్తూ యుండగా సంఘ సభ్యులగుటకు ఎవరు ఇష్టపడతారు? అందువలన, దేవుని ముందు పవిత్రులముగా యుందము. సంఘం పవిత్రముగా యుండునట్లు సంఘానికి సహాయం చేద్దాం. మనము ఆలాగు చేయుటకు తిరస్కరిస్తే, మనము కూడ తొలగిపోవలెను.

5. పాపమును, దోషమును ఎదుర్కొనుటకును, హిత సువార్తను ప్రకటించుటకును సహకరించుటలో మనము సంఘమునకు బాధ్యులమై యున్నాం. పౌలు ఇట్లు చెప్పాడు: "వాక్యమును ప్రకటించుము; సమయమందును అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము గద్దించుము, బుద్ధిచెప్పుము" (2 తిమోతి 4:2). "మీరు సర్వలోకమునకు వెళ్ళి, సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి" అని క్రీస్తు చెప్పాడు

(మార్కు 16 : 15). "నీవు హితబోధకు అనుకూలమైన సంగతులను బోధించుము" అని పౌలు మరల చెప్పాడు (తీతు 2 : 1). దేవుని వాక్యము బోధించాలని, బోధ హితముగా యుండాలని, పాపమునకు ఐహికతత్వమునకు భక్తిహీనతకు వ్యతిరేకముగా బోధించాలని, అబద్ధ బోధను ఖండించాలని తెలియజేయు ఇలాంటి అనేక వాక్యములు లేఖనములలో ఉన్నాయి. మరొక మాటలో, మనము బోధించుటలో శక్తివంతులమై, ఎల్లప్పుడు ప్రేమతో బోధిస్తూ యుండవలెను. సత్యమును ప్రకటించుటలో దృఢముగా యుండాలి. ఈ విషయములో మనము మృదువుగాను, బలహీనముగను వ్యవహరించినట్లయితే సంఘం బలహీనమైపోతాది. సభ్యులు సమసిపోతారు, లేక అబద్ధ బోధకులు మనలను మోసగించి దేవునిదగ్గర నుండి తొలగించి వేస్తారు. శక్తివంతమైన బోధవలనను, అటువంటి బోధకు సహకరించుటవలనను సంఘం పటిష్ట మౌతాది.

6. మనము నమ్మకమైన సభ్యులముగా యుండుటలో స్థానిక సంఘమునకు బాధ్యులమై యున్నాము. ఆరాధనలకు హాజరగుట మాత్రమే కాదుగాని, మన గృహాల్లోను, ఉద్యోగాల్లోను, అన్నిటిలో మనము చెప్పుటయందు చేయుటయందు, అన్ని విషయాలలోను నమ్మకముగా నుండవలెను. మనము క్రైస్తవులమనియు, క్రీస్తుసంఘ సభ్యులమనియు జ్ఞాపక ముంచుకొనవలెను. క్రీస్తు ఘనత నొందునట్లు, అందరివలన సంఘము గౌరవింపబడు రీతిగా ప్రతి విషయములో మన శక్తిని కనుపరచాలి. మనము ఆదివారవు క్రైస్తవులవలె కాదుగాని వారములో ప్రతిదినము క్రైస్తవులవలె ప్రవర్తించాలి. పౌలు ఇట్లు చెప్పాడు : "నిన్ను గూర్చియు నీబోధను గూర్చియు జాగ్రత్త కలిగి యుండుము. వీటిలో నిలకడగా యుండుము; నీ వీలాగు చేసి నిన్నును నీ బోధ వినువారిని రక్షించుకొందువు" (1 తిమోతి 4:16). మనము సంఘాన్ని ప్రేమించి, మనకు సాధ్యమైనంతమట్టుకు సహాయం చేయ

వలెను. మరొక మాటలో, క్రైస్తవేతరుల మధ్య మన మెన్నడు సంఘాన్ని విమర్శింపవలదు. సభ్యులను గూర్చి సణుగుకోకూడదు. తప్పులెన్నకూడదు. మీకేదైనా సమస్య ఉన్నట్లయితే సంఘము నొద్దకే తీసుకొని వచ్చి సరిదిద్దండి. మనము సభ్యుల నొద్దకు వెళ్ళి సమస్యలను, చీలికలను కల్పించరాదు. ఇటువంటివి బైబిలు బోధకు వ్యతిరేకము. పైగా, మనము ప్రభువుకు నమ్మకముగా యుంటే, సంఘమునకును నమ్మకముగా నుండవలెను.

మీరు చూచిన విధముగా, స్థానిక సంఘ సభ్యులమైన మనకు నిర్దిష్టమైన విధులు, బాధ్యతలు ఉన్నాయి. సంఘ సభ్యులమును క్రైస్తవులమైన మనకు ప్రసాదింపబడు ఆశీర్వాదములు, మేలులు ఉన్నాయి. కాని ప్రభువునొద్దకు తిరిగివచ్చి ఆయన కాంక్షించు రీతిగా జీవింపనట్లయితే వాటిని పొందలేము. మన పాత్ర మనము నిర్వహిస్తే సంఘం అభివృద్ధి నొంది వ్యాప్తి జెందుతాది. దాని అర్థ మేమిటంటే, మన కర్తవ్యాన్ని మనం నెరవేర్చినట్లే. దానితోబాటు చెప్ప నశక్యమైన సంతోషము, సంతృప్తి కల్గుతాది. మన పాత్రను మన మెల్లప్పుడు నిర్వహించునట్లు దేవుడు మనలను దీవించును గాక. ప్రభువు తన పాత్రను తప్పక నిర్వహిస్తాడని మనకు విదితమే.

---

## అయినను నీ మీద తప్పు మోపవలసి యున్నది

## *( But I have This Against Thee )*

ఈ వ్యాసాన్ని డిశంబరు 31, 1983 న నేను వ్రాయుచున్నాను. కొన్ని గంటలలో ఒక క్రొత్త సంవత్సరం ప్రవేశిస్తాది. ఆర్థిక సంవత్సరానంతరము వ్యాపారస్థుడైన ప్రతివాడు తానేమైనా లాభం పొందాడో లేక నష్టపోయాడో తెలిసికొను నిమిత్తం తన వ్యాపారాన్ని సమీక్షిస్తాడు. క్రైస్తవుడు తన పనియందు ఆసక్తి కలిగి

యుండాలి. ఈ లోకంలోయున్న అతి ప్రాముఖ్యమైన పని—ప్రభువును సేవించుట. అది మొదట దేవుని రాజ్యాన్ని వెదకుట (మత్తయి 6:33). పరలోకమందు ధనాన్ని సమకూర్చుకొనుట (మత్త 6:20).

నేను భారతదేశంలో మొదట అడుగుపెట్టిన నాటినుండి ఇప్పటికి 21 సంవత్సరాలైనది. ఆ కాలాన్ని మనం వెనక్కి తిరిగి చూసుకోవచ్చును. క్రీస్తుకొరకు జరిగిన సంగతులను మనం పర్యవేక్షించి అవి గొప్ప అభివృద్ధి జరిగిన సంవత్సరాలని మనం చెప్పుకోవచ్చు. కొన్ని లక్షలమంది బాప్తిస్మము పొందారు. నిజానికి కొన్నివందల స్థానిక సంఘాలు ఆరంభింపబడ్డాయి. క్రొత్త నిబంధన మార్గము నొద్దకు మరలుడి యనే విజ్ఞాపనను బోధించే అనేకమంది మంచి బోధకులు ఉన్నారు. అన్నింటిలోను ముఖ్యముగా మన సహోదరులు ఆత్మీయ జీవితాన్ని జీవించుచున్నారు. సంఘాల్లో సిద్ధాంత సామరస్యత యున్నది. ఆ సామరస్యత దేవుని వాక్యముపై ఆధారపడి యున్నదని నా దృఢవిశ్వాసము (రోమా 10:17).

భారతదేశంలోని 22 రాష్ట్రాల్లోను 17 రాష్ట్రాల్లో క్రీస్తుసంఘములు ఒకటికంటే ఎక్కువ యున్నవి. మిగతా దేశాలతో పోల్చుకొంటే ఇది చాలమంచి అభివృద్ధియే. ఎఫెసులోని సంఘానికి ప్రభువు ఒక వర్తమానాన్ని పంపుచు అనేక సంగతులను గూర్చి వారిని మెచ్చుకొన్నాడు. అయినను నేను నీమీద తప్పు ఒకటి మోపవలసి యున్నదని యని ఆయన చెప్పాడు (ప్రక 2:4). వారు మారుమనస్సు పొందని యెడల ఆయన వచ్చి దీపస్తంభమును వారినుండి తీసివేతునని ఆయన హెచ్చరించాడు (ప్రక 2:5). మన పనిలో కొన్ని ప్రాముఖ్యమైన బలహీనతలున్నవి. అవి సరిచేయబడాలి. మన సంఘాలు సంఘాలుగా పనిచేయడం లేదు (రోమా 1:8; 1 థెస్స 1:7, 8). సంఘముద్వారా దేవుని యొక్క నానావిధమైన జ్ఞానము ప్రకటింపబడాలి. మనము అడుగువాటన్నిటి కంటెను ఊహించువాటన్నిటి కంటెను సంఘము ద్వారా దేవుడు పనిచేయగలడు (ఎఫెసీ 3:20, 21).

# మన బలహీనత

మేము బీదవారమని చెప్పి మనము సాకులు చెప్పుచుయుంటాము. థెస్సలొనీకయలోని సంఘము బహు నిరుపేదలు, అయినను వారు తమపనిని నిర్వర్తించారు. తమ పనిని నిర్వర్తించుటయేగాక పరిశుద్ధుల కొరకైన పరిచర్యకు యిచ్చుటకు మనఃపూర్వకముగా బతిమలాడారు (2 కొరింథీ 8 : 1-5). భారతదేశపు క్రీస్తుసంఘాలలో ఇది ఎందుకు జరుగదు? దేవుడు తన పనిని బీదవారికే యిచ్చాడు (యాకోబు 2:5). అయినను ఈ పనిని కొనసాగించడంలో మనం బహుగా విఫలుల మౌతున్నాము. ఇవ్వవలసిన రీతిగా ఇయ్యకపోతే దాని పర్యవసానం ఘోరంగా యుంటాది. మనకు బోధకలుగుటకు వ్రాయబడిన పాతనిబంధన కాలంలో తన ప్రజలు మందిరపు నిధిలోనికి తమ పదియవ వంతును తీసికొని రానందున వారు శాపగ్రస్తులై యున్నారని దేవుడు చెప్పాడు (మలాకీ 3:8-10). లూకా 6:38 లో యేసు ఒక వాగ్దానం చేసాడు. మొదట మనం ఆయన రాజ్యాన్ని వెదికితే ఈ భౌతిక సంగతులన్నియు మన కనుగ్రహింపబడును (మత్త 6:33). మీరీయగలిగిన రూపాయిని అమెరికా వారిచ్చినట్లయితే, అంతమట్టుకు మీరు దొంగిలింపబడ్డారు. ఇంకొకరు యిచ్చినదాన్ని బట్టి మనంపొందే బహుమానం యేమీలేదు. పరలోకమందు ధనాన్ని సమకూర్చుకోవాలని మనకు ఆజ్ఞాపింపబడింది (మత్త 6 : 19-21). లేఖనముల ప్రకారము యిచ్చుచున్న సంఘాలు స్వల్పమే. బాప్తిస్మము యొక్క ప్రయోజనాన్ని గూర్చి బోధించుటలో బైబిలు ఎంత ఖచ్చితంగా యున్నదో కానుకలు ఇచ్చుటను గూర్చికూడా అంత ఖచ్చితంగానే యున్నది. భారతదేశంలో యున్న సంఘాలకు ప్రభువు ఒక వర్తమానాన్ని పంపితే, ముఖ్యంగా మీరు లేఖనముల ప్రకారం యిచ్చుట లేదని చెప్పును. బహుశా మనదంత ఒక మినహా అని, అమెరికాలోని తల్లిసంఘమే మనలను పోషించాలని దీని వెనుకనున్న అభిప్రాయం

కావచ్చును. మిషను అంటూ యేమీ లేదు గాని ఒకే ఒక్క సంఘమున్నది. సమస్త జనాంగములు దానిలోనికి ప్రవహిస్తాయి (యెష 2:2).

## మార్పు అవసరం

అపొస్తలుడైన పౌలు బర్నబాతో కలసి అన్యులకు సువార్త బోధించాడు. వారు దానికి లోబడ్డారు. అయిదు సంవత్సరాల కంటే తక్కువ సమయంలోనే వారు అన్ని స్థానిక సంఘములలోను పెద్దలను నియమించగలిగారు (అపొ. కా. 14:23). ఈ విషయంలో కూడ మనం చాల విఫలుల మయ్యాము. ఎందువలన? ఒకే ఒక్క జవాబు దీని కున్నది—క్రొత్త నిబంధన మాదిరిని మనం అనుసరించవలసిన రీతిగా అనుసరించలేదు, అంతే. డినామినేషన్లలో యున్న పాస్టర్ల పద్ధతి ననుసరిస్తూ విశ్వాసుల సార్వజనిక యాజకత్వాన్ని విసర్జించడంజరిగింది (1 పేతురు 2:5, 9). మనవారికంటే శ్రేష్టమైన వారితో వారు పని చేయలేదు. "క్రేతీయులు ఎల్లప్పుడు అబద్ధికులును, దుష్టమృగములును, సోమరులగు తిండిపోతులునై యున్నారు" అని చెప్పబడింది (తీతు 2 : 12). భారతదేశపు ప్రజలనుగూర్చి ప్రభువు అంతకంటే మంచిగానే చెబుతాడని నా విశ్వాసం. అయితే క్రేతు ద్వీపములో యున్న ప్రతిపట్టణములోను పెద్దలను నియమించు నిమిత్తమే పౌలు తీతును అక్కడ విడిచాడు. వారి అర్హతలుకూడా ఇయ్యబడినవి (తీతు 1:5-9). ఈ మార్పు ఎట్లు కలిగియుంటాది? వారు ప్రభువుతట్టు తిరిగారు (2 కొరింథీ 5:17). మార్పు జెందిన జీవితము యొక్క ఆవశ్యకతను సంఘము చూడగలిగింది. అట్టిమార్పు మనలో కావాలని కాంక్షించినప్పుడు దేవుడు దాన్ని కలుగజేయగలడు. సువార్తలో మనకున్న విశ్వాసాన్నిబట్టి అవసరమైన మార్పును కలుగజేసే శక్తి మనకున్నది (రోమా 1:16). సంఘాలలో అవసరమైన మార్పులను కలుగజేసే విశ్వాసము మన కున్నదా?

దీనిని గూర్చి నేను తీవ్రముగా ప్రార్థించుచున్నాను. దీనిని గూర్చి దేవుడు నా కిచ్చిన శక్తి యంతటితోను బోధిస్తాను.

—జె. సి. బెయిలీ.

---

## క్రైస్తవుడగుటలో యిమిడియున్న సంగతులు

(1 థెస్స 1:9, 10 వచనముల పఠనము)

బైబిలు విద్యార్థియైన వాడు దేవుని వాక్యము నుండి బంగారు ఖనిజములాంటి మహోత్తరమును, ప్రశస్తము నైన సత్యములను వెలికి తీస్తాడు. ఒకోసారి, చిన్న వాక్యభాగములోనే, అతడు గంభీరమైన ఉపదేశ సారాంశమును కనుగొంటాడు. మన వాక్యభాగము కూడ అలాంటిదే: "మీ యొద్ద మా కెట్టి ప్రవేశము కల్గెనో, అక్కడి జనులు మమ్మును గూర్చి తెలియజెప్పుచున్నారు. మరియు మీరు విగ్రహములను విడిచిపెట్టి, జీవముగలవాడును సత్యవంతుడు నగు దేవునికి దాసులగుటకును, దేవుడు మృతులలోనుండి లేపిన యేసు, అనగా రాబోవు ఉగ్రతనుండి మనలను తప్పించుచున్న ఆయన కుమారుడైన యేసు, పరలోకమునుండి వచ్చునని యెదురు చూచుటకును మీరేలాగు దేవుని వైపునకు తిరిగితిరో ఆ సంగతి నాకే తెలియజేయుచున్నారు." ఒకడు క్రైస్తవుడగుటలో యిమిడియున్న ఐదు విషయాలను ఈ వాక్యమందు గమనించండి:

### తిరుగుట

1. ఒకడు క్రైస్తవుడగుటలో తిరుగుట యిమిడి యున్నది: మూలభాషనుండి "తిరిగిరి" అని అనువదింపబడిన పదము - తక్షణమే, నిష్కర్షగా నొందిన పరివర్తనను సూచించుచున్నది. క్రీస్తు నొద్దకు వచ్చుటలో అటువంటి పరివర్తనయే యిమిడియున్నది. ఒక పాపి పాపమునుండి తిరిగి తన్ను తాను దేవుని చిత్తమునకు అప్పగించుకొని నప్పుడే అతడు మార్పునొంది యున్నాడు. ఈలాగుననే, పేతురు

దైవిక హెచ్చరిక నిచ్చుచున్నాడు : "మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తము మారుమనస్సు నొంది తిరుగుడి" (అపొ. కా. 3:19). దేవుని చిత్తమునకు లోబడుటలో పాపక్షమాపణనిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందియుండుట యిమిడి యున్నదని పేతురు యొక్క తొలి ప్రసంగమువలన తెలియుచున్నది (అపొ.కా. 2:38).

## దేవుని యొద్దకు తిరుగుట

2. ఒకడు క్రైస్తవుడగుటలో దేవుని యొద్దకు తిరుగుట యిమిడియున్నది : మన ఆత్మల శాశ్వత రక్షణ విషయములో ఒక రకమైన పాపమునుండి మరొక రకమైన పాపమునకు తిరుగుటవల్ల ఎట్టి మేలును చేకూరదు. అనేకులు దుర్నీతినుండి, బైబిలులో అగుపడని, దేవునివలన ఆమోదము పొందని, ఏదో యొక మత విధానమునకు తిరిగిరి. దేవుడు సూచించిన పద్ధతి చొప్పున గాక మానవుల పద్ధతి ప్రకారము ఆరాధించుట నిష్ప్రయోజనమని జ్ఞాపకముంచుకొనుటకు జాగ్రత్తపడవలెను (మత్తయి 15:9) మత విషయాల్లో మనము చేయునదంతా దేవుని వాక్యమైన బైబిలువలన ఆమోదము పొందినదై యుండవలెను.

## విగ్రహాల నుండి తిరుగుట

3. ఒకడు క్రైస్తవుడగుటలో విగ్రహములనుండి తిరుగుట యిమిడి యున్నది : జీవము గల సత్యదేవుడు మానవ నిర్మిత భవనములలో నివసింపడు. సరిగదా, ఆయన మానవులు చేసిన విగ్రహముల వంటివాడు కాడు (అపొ. కా. 17:24-31). విగ్రహారాధన చేయుట (మానవులు నిర్మించిన విగ్రహములను లేక సృజింపబడిన దేనినైనను పూజించుట) పాపము. బైబిలులో అది అత్యంతము ఖండింపబడి యున్నది (నిర్గమ 20:4-6; ద్వితీ 4:15-24; రోమా 1:24). నిజానికి దేవునికంటెను ఆయన రాజ్యముకంటెను దేనికైనను ఎక్కువ ప్రాధాన్యత నిస్తే అది "హృదయపు విగ్రహము" అవుతాది (యెహెజ్కేలు 14:3 చూడుము). మనము ఈ విధమైన వైఖరినుండి వైదొలగవలెను మత్తయి 6:31-33).

## దేవునికి దాసులగుటకు

4. ఒకడు క్రైస్తవుడగుటలో దేవునికి దాసులగుటకు తిరుగుట యిమిడి యున్నది: ఇక్కడ "దాసులగుటకు" అనగా "బానిసవలె సేవచేయుటకు" అని భావము. ఒక పాపి క్రీస్తునొద్దకు వచ్చుటలో తన విశ్వాసమును ఒప్పుకొనుట మాత్రమే కాదుగాని కార్యరూపకమైన భక్తిగల జీవితమును కనుబరచవలెను. "లోబడుటకు దేనికి మిమ్మును మీరు దాసులుగా అప్పగించుకొందురో, అది చావు నిమిత్తముగా పాపమునకేగాని, నీతినిమిత్తముగా విధేయతకేగాని దేనికి మీరు లోబడుదురో దానికే దాసులగుదురని మీరెరుగరా? మీరు పాపమునకు దాసులై యుంటిరిగాని యే ఉపదేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయపూర్వకముగా లోబడినవారై, పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి. ఇందుకు దేవునికి స్తోత్రము......పరిశుద్ధత కలుగుటకై యిప్పుడు మీ అవయవములను నీతికి దాసులుగా అప్పగించుడి. మీరు పాపమునకు దాసులై యున్నప్పుడు నీతివిషయమై నిర్బంధము లేనివారై యుంటిరి ... అయినను ఇప్పుడు పాపమునుండి విమోచింపబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము; దాని అంతము నిత్య జీవము" (రోమా 6:16-22).

## క్రీస్తురాకకు ఎదురు చూచుటకు

5. ఒకడు క్రైస్తవుడగుటలో క్రీస్తుకొరకు ఎదురుచూచుటకు తిరుగుట యిమిడియున్నది: క్రైస్తవుడు పొందిన వాగ్దానము లన్నిటిలో కెల్ల మిక్కిలి గొప్పది ఏదంటే—క్రీస్తు భూలోకమునుండి పరలోకమునకు ఆరోహణుడైన రీతిగా, ఆయన ఏదో యొక దినమున తిరిగి వచ్చి, నీతిమంతుల నందరిని తన యొద్దకు సమకూర్చుకొని పరలోకము తోడ్కొని పోవును. "మన పౌరసత్వము పరలోకము నందున్నది; అక్కడ నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుడు వస్తాడని ఆ ఖర తతో ఎదురు చూస్తున్నాము" (ఫిలిప్పీ 3:20).

ఈ వాక్యములు చదువువారందరు—"విగ్రహములను విడిచి పెట్టి, జీవముగల సత్యదేవుని సేవించుటకును పరలోకమునుండి రానై యున్న ఆయన కుమారుని కొరకు ఎదురుచూచుటకును దేవునివైపు తిరుగుదురని" నాయొక్క నిరీక్షణయు ప్రార్థనయునై యున్నది.

— రోజర్ ఫిష్ట లెట్.

---

# నీవు ఎలాంటి క్రైస్తవుడవు?

## I పరిచయం :

నేటి లోకములో రకరకాల క్రైస్తవు లున్నందువలన, అసలు క్రైస్తవుడంటే ఎవరో తెలుసుకొనుట ఆవశ్యకం.

## II చర్చనీయాంశములు :

### A. నిజ క్రైస్తవులు :

1. క్రీస్తు సంఘ సభ్యులు (అపొ. 11:26).
(క్రీస్తును విశ్వసించి, మారుమనస్సు పొంది, ఒప్పుకొని, బాప్తిస్మం పొందినవారు)
2. క్రీస్తువంటివారు (1 కొరింథీ 11:1; 1 తిమోతి 4:12).
3. క్రీస్తు సారూప్యముగలవారు (గలతీ 4:19;
రోమా 8:29; ఆది 1:27).
4. క్రీస్తు మనస్సు కల్గినవారు (1 కొరింథీ 2:16;
ఫిలిప్పీ 2:5; గలతీ 5:21).
5. క్రీస్తు వాక్యములు చేయువారు (లూకా 2:49; ఫిలిప్పీ 2:21;
యాకోబు 1:4; కొలస్స 1:29; హెబ్రీ 6:6, 9).
6. క్రీస్తు అడుగుజాడల్లో నడచువారు (1 పేతురు 2:21;
2 తిమోతి 3:12; కొలస్స 1:24; అపొ. 14:22).

B. నామకః క్రైస్తవులు :

1. నిర్జల మేఘాలు (యూదా : 12).
2. నీళ్ళు లేని బావులు (2 పేతురు 2 : 17).
3. ఉప్పదనం లేని ఉప్పు (మత్తయి 5 : 13).
4. ఫలింపని చెట్టు (లూకా 13 : 6-9).
5. బద్దలైన ఓడ (1 తిమోతి 1 : 19).
6. క్రీస్తు లేని సంఘం (ప్రకటన 3 : 14-20; 2 కొరింథీ 13 : 5).

C. నకిలీ క్రైస్తవులు :

1. నకిలీ క్రీస్తును అనుసరించువారు (మత్తయి 24 : 24).
2. నకిలీ పరిచారకులు (2 కొరింథీ 11 : 11).
3. నకిలీ బోధను ప్రేమించి, గైకొనువారు (ప్రకటన 22:15).
4. నకిలీ సువార్తవలన క్రీస్తు సువార్తను కల్తీ చేయువారు (గలతీ 1 : 7).

III ముగింపు :

1. నిజ క్రైస్తవులు నమ్మకముగా కొనసాగాలి (ప్రకటన 2 : 10).
2. నామకః క్రైస్తవులు మారుమనస్సు నొందాలి (ప్రకటన 3 : 20).
3. నకిలీ క్రైస్తవులు సత్యాన్ని మనస్కరించి, అవగాహన చేసికొని, అవలంబించాలి.
4. నీవు ఎలాంటి క్రైస్తవునిగా ఉన్నావు ?

— S. ప్రభుదాస్, కాకినాడ.

## బోధకులకు యేసు మాదిరి
## *(Example of Jesus for Preachers)*

బోధకులు అనేక సంగతులనుగూర్చి తెలిసికొనుటకంటే యేసు పరిపూర్ణ బోధకుడెట్లయ్యాడో, యితరులకు దేన్ని యెలాగ బోధించాడో తెలిసికొనుట మంచిది. మత్తయి 9 : 31-10 : 42 వరకు ఉన్న వాక్యభాగంలో గొప్ప బోధకుడైన క్రీస్తును మనం వినగలం, చూడగలం.

1) ఆయన కీర్తి గడించిన మనుష్యుడు (9:31).
2) తన్ను వ్యతిరేకించే వారుందురని ఆయన ఎరుగును (9 : 34; 10 : 16; 21-22).
3) ఆయన విరామము లేక బోధించుచు సువార్త ప్రకటించుచు ఉండెను (9 : 35).
4) ఆయన ఒకే పట్టణములో గాని, లేక ఒకే బిల్డింగ్‌లో గాని తన బోధను బోధించలేదు (9 : 35).
5) ప్రజలయెడల ఆయన కనికరపడెను (9 : 36).
6) భౌతికంగా బాధపడుచున్న మానవుల అవుసరాలను గూర్చి ఆయన చింతించాడు (9 : 35).
7) కోతను ఆయన చూచాడుగాని, దాని కష్ఛనుగాని సమస్యలనుగాని కాదు (9 : 37).
8) పనికంటే పనివారు తక్కువ అనే సమస్యను ఆయన గుర్తించాడు (9 : 37).
9) పనివారియొక్క అవుసరతను తీర్చే జవాబు దేవుని నుండే కలుగునని ఆయనకు తెలుసు. పనివారికొరకు ఆయన ప్రార్థించాడు, వారిని పిలిచాడు, శిక్షణ యిచ్చాడు (9:37-10:42).
10) బోధకులు పనివారైతే వారు భిక్షగాండ్రు కాదని ఆయన బోధించాడు (10:9-10).

11) అంగీకరింపబడుటకు ఎదురు చూడుడని ఆయన చెప్పాడు (10 : 9-15).
12) లోకజ్ఞానం (common sense), సమయస్ఫూర్తి కలిగి యుండాలని ఆయన చెప్పాడు (10:16).
13) సంభవింపబోవు విపత్తులను గూర్చి ఆయన ఎరిగి యుండి, సత్యాన్ని చెప్పాడు (10:16-28).
14) సహనమునుగూర్చి ఆయన వక్కాణించాడు (10:22).
15) ప్రతిఫలాలను తెలియ జెప్పుటకు ఆయన మరచిపోలేదు (10:22, 32, 39, 42).
16) ఆయనే మాదిరియై యుండెను (10:24, 25).

పై నుదహరించిన ఈ సూత్రముల ననుసరించుటవలన యేసు ప్రభువు, ఆయన శిష్యులు ఆనాటి లోకానికంతకు సువార్త ప్రకటించారు. వారికి ఆధునిక వాహనాలు గాని, సమాచార సాధనాలుగాని లేవు. వారు బలమైన వ్యతిరేక శత్రువును ఎదుర్కొన్నారు. అయినను లోకమంతా సువార్తను వ్యాపింపజేసారు. యేసు మాదిరినే మనం కూడ అనుసరిస్తే నేటి లోకానికంతకూ సువార్త ప్రకటించగలము. మనము ప్రకటించాలి, ప్రకటించగలము !

— డేవిడ్ అండర్‌వుడ్.

---

విశ్వాస వీరులు-2

## దేవునితో నడచిన హనోకు

### *( Enoch, who walked with God )*

"విశ్వాసమును బట్టి హనోకు మరణము చూడకుండునట్లు కొనిపోబడెను; అతడు కొనిపోబడక మునుపు దేవునికి ఇష్టుడై యుండెనని సాక్ష్యము పొందెను" (హెబ్రీ 11:5).

హనోకు గూర్చి బైబిలులో రికార్డు చేయబడింది స్వల్పమే

అయినను, ఆ స్వల్పంలోనే అతడెట్టివాడో మనం అర్థము చేసికొనగలము. హనోకు చనిపోలేదు గనుక అతన్ని గూర్చి మనందరం వినియున్నాము. అయితే అతడు మరణమనే శీతల అగాధాన్ని ఎందుకు దాటలేదో మనం సాధారణంగా ఆలోచించము. హనోకు ఎందుకు చనిపోలేదు ? అతనికున్న గొప్ప విశ్వాసాన్ని బట్టి అతడు చనిపోలేదని హెబ్రీ 11:5 ను బట్టి మనం తెలిసికొనగలం.

అతడు గొప్ప విశ్వాసవీరుడని మనం గ్రహించుటకు కనీసం మూడు కారణాలున్నాయి.

1) యూదా పత్రిక 14 వ వచనంలో అతడు ప్రవక్త యని లేక బోధకుడని చెప్పబడింది. హనోకు ప్రవచించి యిట్లనెను: "ఇదిగో అందరికిని తీర్పు తీర్చుటకును, వారిలో భక్తిహీను లందరును భక్తిహీనముగా చేసినవారి భక్తిహీన క్రియలన్నిటిని గూర్చియు, భక్తిహీనులైన పాపులు తనకు విరోధముగా చెప్పిన కఠినమైన మాటలన్నిటిని గూర్చియు వారిని ఒప్పించుటకును ప్రభువు తన వేవేల పరిశుద్ధుల పరివారముతో వచ్చెను".

మానవజాతిలో హనోకు యేడవ తరమువాడని మనం ఎరిగిన తరువాత అతడు బోధించునది గొప్ప విశ్వాసముతో బోధించెనని మనం తెలిసికోవచ్చును. దేవుని నుండి మానవుని కియ్యబడిన లిఖిత పూర్వక చట్టం యేమీ అప్పుడు లేదు. ఆయనకు అవిధేయులైన వారిని దేవుడెట్లు శిక్షించెనో లేక ఎట్లు సరిదిద్దెనో మన కేమీ రికార్డు లేదు. హనోకు దేవునిపై తనకున్న విశ్వాసమంతటిపై ఆధారపడి పనిచేయవలసి వచ్చెను.

2) హనోకు దేవునితో నడిచెనని మనం అతన్ని గూర్చి తరువాత తెలిసికొనగలము. "హనోకు అరువది యైదేండ్లు బ్రదికి మెతూషెలను కనెను. హనోకు మెతూషెలను కనిన తరువాత మూడు వందల యేండ్లు దేవునితో నడచుచు కుమారులను కుమార్తెలను కనెను.

హానోకు దినములన్నియు అరువది యైదేండ్లు. హానోకు దేవునితో నడచిన తరువాత దేవుడతనిని తీసుకొనిపోయెను. గనుక అతడు లేకపోయెను" (ఆది 5:21-24).

అతనికొక కుమారుడు కలిగిన తరువాత హానోకు దేవునితో నడచుట కారంభించెనని గమనించుము. తమ పిల్లలకు మంచి మాదిరిని కనబరచే బాధ్యతను తలిదండ్రులు వహించుట ఎంత మంచిది! దేవునితో నడచుటకంటే శ్రేష్టమైన మాదిరిని దేనిని కనబరచ గలరు? హానోకు మూడు వందల సంవత్సరములు దేవునితో నడిచాడంటే ఎంత గొప్ప విశ్వాసం అవసరమై యుండెనో గమనించుము.

3) హానోకును గూర్చి మనకు తెలిసిన మరొక విషయం యేమంటే, అతడు దేవుని కిష్టుడై యుండెను. ఇది ఆశ్చర్యము కాదు! ఈ మనుష్యుడు తన విశ్వాసంతో బాటు క్రియలను కనబరుచుచుండెను గనుక దేవుడు ఎంత సంతోషించి యుండెనోగదా, అతడు తన కాల ప్రజలకు సత్యాన్ని బోధించాడు, భక్తిగల కుటుంబాన్ని కలిగి యున్నాడు, దేవునికి ఎంత సన్నిహితంగా యుండి పనిచేయాలో అంత సన్నిహితంగా యున్నాడు.

నీవు నేను దేవునికి ఇష్టులుగా యుండుటకు ప్రయత్నించుటలో, మనం హానోకు మాదిరి ననుసరించుట మంచిది. హానోకువలె సత్యాన్ని బోధించుదాం, భక్తిగల కుటుంబాన్ని కలిగి యుందాం, దేవునికి దగ్గరగా యుండి పనిచేద్దాం, దేవునితో నడుద్దాం. —డేవిడ్ జాన్సన్.

---

## అధికముగా నీతిమంతుడవై యుండకుము

### *(Be not righteous over much)*

మానవుడు మతంలో తీవ్రంగా వుండాలని చూస్తాడు. అతి, మిత వాదాలనే గుంటలను తప్పించుకొంటూ మధ్య మార్గంలో పయనించటం కొంత ప్రత్యేక శ్రమ తరువాతనే సాధ్యం.

మహాజ్ఞాని సొలోమోన్ "అధికముగా నీతిమంతుడవై యుండ కుము. అధికముగా జ్ఞానివి కాకుము. నిన్ను నీవేల నాశనము చేసి కొందువు ?" అని మనకు సలహా యిస్తున్నాడు (ప్రసంగి 7: 16). పవిత్రతకోసం తపిస్తూ కొందరు దేవుడు అనుమతించిన వాటిని కూడా వదిలేశారు. దేవుని నియమాలకంటే కఠినమైన నియమాలు తమపై విధించుకొన్నారు. లేఖనాలలో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

ప్రతి సంవత్సరం ఒకరోజు ఉపవాసం ఉండమని దేవుడు ఆజ్ఞాపించాడు (లేవీ 16:29-31). కాని పరిసయ్యులు వారానికి రెండుసార్లు ఉపవాసం ఉన్నారు (లూకా 18:12). సబ్బాతు దినాన దాసుడు సైతము పనిచేయకూడదని దేవుని ధర్మశాస్త్రము (ద్వితీ 5:12-15). కాని పరిసయ్యులు 'ఆ దినాన ఒక రోగిని సైతం వైద్యుడు పరామర్శించ వీలులేద'న్నారు (యోహాను 9 : 13-16). ఇలాంటి అతి ప్రయత్నాలు వాంకి ప్రత్యేక దీవెనలేమీ తేలేదు, లేక దేవునిచే ప్రత్యేకముగా గుర్తించబడి లేదు. అలాంటి నీతిక్రియలన్నియు మురికి గుడ్డల్లాగా వున్నాయి (యెషయా 64 : 6). వారి స్వంత బుద్ధులను దేవుని న్యాయానికి కలుపటానికి తెగించి దేవుని వాక్యాన్ని మీరారు (సామెతలు 30:6). వారి సంప్రదాయాలకోసం దేవుని వాక్యాన్ని నిరర్థకం చేసారు గనుక వారి ఆరాధన వ్యర్థమైనదిగా ప్రకటించబడింది (మత్తయి 15:6, 9). అలా అతిగా ప్రవర్తిస్తూ మాతో సములెవరా అన్నట్లు గర్వంగా చూచేవారు. అదే వారి ప్రతిఫలం. దేవుడు వారి నంగీకరించడు (మత్తయి 6:5).

## కొన్ని నవీన ఉదాహరణలు

1. తప్పయినది చేయకపోవటం, ఇంకేమీ చేయకపోవటం: ఒక తలాంతు పుచ్చుకొన్నవాడు చేసిన పొరపాటు యిదే (మత్తయి 25:24-30). ఈ ప్రవర్తనే అనేక స్థానిక సంఘాలు లోకానికి సువార్త బోధించకుండా ఆటంకపరచినది. తప్పుడు మార్గానికి సహకరిస్తామేమో

నసే భయంతో, అనేక స్థానిక సంఘాలు అసలు సహకరించటమే మానుకొన్నాయి. పాపపు విధానాన్ని అనుసరిస్తామేమో నసే భయంతో, చాలామంది అభాగ్యులకు సేవ చేయాలనే ప్రయత్నమే మానుకొంటారు.

2. ఏగుంపుకు చెందకుండా వుండాలనే తపనతో దేవుని పనిలో వాడదగిన వాటినికూడా కొందరు వాడరు. కొందరు సోదరులు బైబిలు తరగతులను తిరస్కరించారు. ఎందుకంటే కొన్ని శాఖలవారు దాన్ని అనుసరించారట! కొందరు వ్యక్తిగత బోధనను, కొందరు సువార్త బోధకుల పద్ధతిని, విసర్జించారు. కానీ అవన్నీ క్రొత్త నిబంధన అనుమతించింది. ఇవన్నీ అనుసరించకపోయినా అతడు క్రైస్తవుడే. కాని వాటిని ఉపయోగించటం వలన శక్తివంతంగా దేవుని పని జరిగించగలడు. వీరు తమను తాము బంధించుకోవటమే గాక, ఇతరులమీద నిర్బంధాలు విధిస్తారు. అందువలన ఆ పద్ధతి తిరస్కరింపబడింది (యాకోబు 4:11-12).

3. దేవునికంటే ఎక్కువగా లోకాన్ని విసర్జించటం : చాలా సినిమాలు రెచ్చగొట్టేవిగాను, దిగజార్చేవిగాను ఉంటాయి. కానీ అన్నీ అలానే వుండవు. అయినా కొందరు "వాల్ట్ డిస్నీ" కుటుంబ చిత్రం సైతం క్రైస్తవులు చూడరాదు అంటారు. టెలివిజన్ విషయంలో కూడా అంతే. జ్ఞానం ఏంచెబుతుందంటే చెడును విసర్జించి, మంచిని ఆచరించు, అనుభవించు అని.

మందులు, స్వాదుపానీయమైన ఆల్కహాలుమీద వున్న వ్యతిరేకతకొద్దీ కొందరు ఆల్కహాలు ఉన్న మందులే వాడకూడదని తీర్మానించారు.

4. కొందరు సోదరులు, తప్పుడు తత్వశాస్త్రము, వైజ్ఞానము వలన వచ్చే ప్రమాదాలనుబట్టి, ఆధునిక విద్యను వద్దన్నారు. వారు తిరస్కరించటమే కాక, మంచి విశ్వాసులై చదివే వారిని కూడా

ప్రశ్నించారు. అజ్ఞానంమీద దేవుడేమీ ప్రీమియం విధించలేదు. పౌలు మహాపాండిత్యము గలవాడు (అ.కా. 22:3). ఒక సువార్త బోధకునికి తన పనిలో కావలసిన జ్ఞానమంతా కావాలి.

5. మన ప్రజలమధ్య దూషణలను ఎదుర్కోవటంలో, ఇంకొక మంచి పనిని తిరస్కరించటం: ఉదాహరణకు, మన క్రైస్తవ పాఠశాలల్లో కొన్ని సమస్యల నెదుర్కోవటం కోసం, కొందరు వాటిని మూసివేస్తారు. వారి పిల్లల చదువులపై ఇది ఎలాంటి ప్రభావం కలిగిస్తుందో వారు ఆలోచించరు. ఎవరైనా విమర్శిస్తూ ప్రార్థిస్తుంటే ఇతరులందరికీ అదే వంటబడుతుందని అలాంటి ప్రార్థన ఆపెయ్యమంటారు. కాని మనం ప్రార్థించేవానిని నిరుత్సాహపరచ కూడదు.

## గుర్తించుకోవలసిన కొన్ని సూత్రాలు

అనవసరమైన వాటిలో తన్ను తాను నియంత్రించు కోవాలని అనుకొనేవాడు అలానే చేయవచ్చు. పౌలు అలానే చేశాడు. కాని ఇతరులను నియంత్రించే హక్కు అతనికి లేదు (రోమా 14:2-4).

దేవుడు కోరినదానికంటే అధికంగా ఖచ్చితంగా వుండవలసిన అవసరం నాకు లేదు. అది దేవుని మెప్పించదు, నాకు సహాయపడదు. నా పొరుగువారు నేనొక వెర్రివాడినని లెక్కించేలా అది చేయవచ్చు. అధికంగా నీతిమంతుడై యుంటే వచ్చే చిక్కేయిది. పాపాలను గురించిన భయంతో, దేవుడు చేయమని చెప్పిన పనులు గూడ చేయకుండా వుంటాము. ఆ ఒక్క తలాంతు మనిషిలాగా, "సోమరివైన చెడ్డ దాసుడా, పనికిమాలినవాడా" అని నిందించబడతాము.

"అధికంగా నీతిమంతుడవై యుండకు...నిన్ను నీవే ఎందుకు నాశనం చేసికొంటావు?"

—జాన్ వాల్వ్

---

గమనిక :—సత్యవాక్కు పత్రిక ఒకటికంటె ఎక్కువ కాపీలు మీకు అందుచున్నయెడల మీ నంబర్లతో సహా మాకు తెలియచెయ్యండి.

# బైబిలు బాప్తిస్మము

## ( *Bible Baptism* )

బాప్తిస్మమును గూర్చి సత్యమును చెప్పు గ్రంథము బైబిలు ఒక్కటి మాత్రమే. గనుక ఈ అంశమును గూర్చిన సత్యమును తెలిసికొనుటకు మనము దేవుని ఆత్మావేశ లేఖనములను పరిశోధించవలెను. దయచేసి ఈ దిగువ వాస్తవములను గమనించుము :

1. ఒకే ఒక్క బాప్తిస్మమున్నది (ఎఫెసీ 4:5). ఈ వాస్తవము క్రీ॥ శ॥ 64 సం॥లో వ్రాయబడెను. అదివరకు మరి కొన్ని బాప్తిస్మము లుండెను గాని అప్పటికి ఒకే ఒక్క బాప్తిస్మము ఉండెను.
2. అది సమాధి (కొలస్స 2:12; రోమా 6:3, 4). బాప్టిజో అను గ్రీకు పదమునుండి కలిగిన ఈ మాటకు ఎల్లప్పుడు సమాధి, ముంచబడుట యను అర్థము వచ్చును. గాని అది ఎన్నడు చిలకరించుటగాని కుమ్మరించుటగాని కాదు.
3. అది ఒక నీటి సమాధి (అపొ. కా. 8:36-39).
4. అది సువార్త యొక్క ఒక ఆజ్ఞ (మార్కు 16:15, 16; అపొ. కా. 10:48).
5. అది తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిద్ధాత్ముని యొక్కయు నామమందు చేయబడ వలెను (మత్తయి 28:19, 20).
6. అది రక్షించును (1 పేతురు 3:21).
7. అది పాపక్షమాపణ కొరకు (అపొ. కా. 2:38).
8. అది పాపములను కడిగివేయును (అపొ. కా. 22:16).

9. అది క్రీస్తులో ప్రవేశింపజేయును (రోమా 6:3, 4; గలతీ 3:26, 27).

10. అది ఒకని సంఘములో ప్రవేశింప జేయును (1 కొరింథీ 12 : 23).

గమనిక : బాప్తిస్మము ఒక్కటి మాత్రమే రక్షించదు. ఒకడు ప్రభువునందు విశ్వాసము కలిగి (హెబ్రీ 11 : 6), పాపముల విషయమై మారుమనస్సు పొంది (అపొ. కా. 17:30), క్రీస్తును ఒప్పుకొని (మత్తయి 10:32), ప్రభునకు విధేయత చూపుచు బాప్తిస్మము పొందిననాడే అది ఒకని రక్షించును (అపొ. కా. 10:48; హెబ్రీ 5:8, 9).

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

To

..............................
..............................
..............................
..............................